# మృగతృష్ణ

ఎడారిలో మొక్క ఎలాగో శివన్నారాయణ బ్రతుకూ అంతే!

ఏకాకి. అండ పొందిన వాళ్ళూ, ఆపదలో ఆదుకునేవాళ్ళూ, అవసరానికి ఆదరణ చూపే వాళ్ళూ-ఎవ్వరూ లేరు.

వయస్సు: పాతిక సంవత్సరాలు.

చదువు: స్కూల్ ఫైనలు.

అందచందాలు: అతి సామాన్యం.

ఆస్తి: శూన్యం.

ఉద్యోగం: లేదు.

మనస్తత్వం: అమాయకత్వం.

తల్లిదండ్రులు పరలోక గతులైనాక, శివన్నారాయణను మేనమామ మాట వరసకు దగ్గరతీశాడు గానీ-అతనివల్ల ఏమీ ప్రయోజనం లేదని ప్రత్యక్షంగా తెలుసుకున్నాక, "ఇంత కాలమూ నిన్ను బంధుత్వ రీత్యా పెంచాను. ఇక మీదట ఆ తాహతు నాకు లేదు. నీ బ్రతుకు నువ్వు చూసుకోడం మేలు. ఈ కాలంలో ఎవరి ఆత్మవిశ్వాసం వారికే జీవిక" అంటూ ఇంటి తలుపులు మూశాడు.

ఆశల రోడ్డుపై అలసి సొలసి ప్రయాణం చేసి ఉద్యోగం కోసం హైదరాబాద్ నగరం చేరుకున్నాడు శివన్నారాయణ.

మూడు రోజులు చెప్పులకు బలపాలు కట్టుకు తిరిగాడు. ఆ బలపాలు అరిగిపోయాయి. కాని, ఉద్యోగం లభించే లక్షణాలు

కనుచూపు మేరలో గాని, మనస్సుకు అందినంత దూరంలోగానీ లేవు. నిరాశా నిస్పృహాలతో నిలబెట్టిన బొమ్మలాగా అయిపోయాడు శివనారాయణ. జేబులో డబ్బులేదు. కాళ్లలో సత్తువ లేదు. కళ్ళల్లో కాంతిలేదు. కడుపులో ఆకలి కరాళదంష్ట్రిస్త్రి మాదిరిగా ఉంది. మరి రోజున్నరైంది తిని.

లకడీ-కా-పూల్ రోడ్డు మీద తూలుతూ, తేలుతూ, నడుస్తూ శివనారాయణ ఏదో ఎంబాసిడర్ కారుక్రింద పడబోయాడు. ఆ కారు తోలే వ్యక్తి కారు ఆపి, డోర్‌లోంచి తలను తాపీగా బయటపెట్టి "ఏయ్! మిస్టర్! బ్రతుకుమీద ఆశలేదా?" అన్నాడు.

ఆయనకు ముప్ఫైఅయిదేళ్ళ కంటే వయస్సు ఉండదు. టెర్లిన్ సూటు వేసుకున్నాడు. దబ్బపండువంటి శరీరచ్ఛాయలో ఆకర్షణీయంగా ఉన్నాడు. గొప్ప ఉద్యోగస్థుడని ఇట్టే గ్రహించవచ్చు.

"బ్రతుకుమీద ఆశ వుంది. కాని, భగవంతుడికే నా మీద ఆశ లేదు" అన్నాడు శివనారాయణ ఎండిన పెదవులపై పచ్చటి చిరునవ్వును తెప్పించే ప్రయత్నం చేస్తూ.

ఆయనకు శివనారాయణ అప్పుడే కొత్తగా "జూ"లోకి వచ్చిన జంతువులాగ చాల వింతగా కనబడ్డాడు.

"ఎక్కు కారు" అన్నాడాయన ఆర్ద్రహృదయంనుంచి వెలువడిన ఆప్యాయతతో.

వెనకా ముందూ చూడకుండా వెంటనే కారు ఎక్కాడు శివనారాయణ.

కారు ఏబిడ్స్ రోడ్ కేసి నెమ్మదిగా వెళుతూన్నది.

"ఏమిటి నీ కథ?" అన్నాడాయన.

శివనారాయణకు ఆనందమేసింది. తన కథను అడిగి తెల్సు

కునే పుణ్యాత్ములు ఇంత మహా నగరంలో వుంటారని అతడు ఎన్నడూ పొరబాటుగానైనా అనుకోలేదు. అందుచేత నీరసించి, నీటితడికి నోచుకోని నాలుకతోనే ఉత్సాహం కనబరుస్తూ తన కథంతా టూకీగా నివేదించుకున్నాడు.

తాజ్‌మహల్ హోటల్ ముందు కారాగింది. కారులోంచి ఆయన దిగాడు. అతన్ని దిగమని చేయి ఆడించాడు. శివ నార్రాయణ కూడా ఆ కారుదిగి ఆయనవెంటే హోటలులోకి నడిచాడు.

'బిల్లు నేను చెల్లిస్తాను. లోపలకు వెళ్ళి సుష్టుగా భోజనం చేసి రా!' అంటూ సోఫాలో కూర్చున్నాడాయన.

ఆయనకు మనస్సులో వేయి నమస్కారాలు పెడుతూ గబ గబా భోజనాలశాల కేసి నడిచాడు శివన్నారాయణ. అరగంట సేపు హాయిగా కడుపు నిండుగా, కళ్ళల్లోకాంతిగా, కాళ్ళలో సత్తువ వచ్చేటట్టుగా భోజనంచేసి, బయటికొచ్చి ఆయనకు నమస్కారం చేశాడు.

తన ఆఫీసు అడ్రసుగల కార్డు యిస్తూ, "రేపు మా ఆఫీసుకు రా ఉద్యోగమిస్తాను!" అన్నాడు రెడ్డీ అండ్ రావు మెడిసిన్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ.

ఆయనకు సాష్టాంగ దండప్రణామంచేశాడు శివన్నారాయణ. ఆ క్షణంలో ప్రపంచం ఎంతో ఉత్తమంగానూ, ఆశాజనకం గానూ కనబడింది. తన మొరాలకించి భగవంతుడే ఆ రూపంలో వచ్చాడా అన్న సంశయానికి కూడా అతను గురైనాడు ఆ మరునాడే శివన్నారాయణ ఠంచనుగా పది గంటలకు ఆ అడ్రసు కార్డును చేత బట్టుకుని నారాయణగూడాలో ఉన్న ఆ ఆఫీసుకు వెళ్ళాడు. రామకృష్ణ అతన్ని కూర్చోబెట్టి, వెంటనే

రెండువందల రూపాయల నెలజీతంతో ఓ క్లర్కు ఉద్యోగాన్ని ఏర్పాటు చేశాడు. పై పెచ్చు అతని లేమికి జాలిపడి ఓ వంద రూపాయల్ని ఎడ్వాన్సుగా గూడా ఇచ్చేట్టు చేశాడు.

ఉన్న పళంగానే శివన్నారాయణ ఉద్యోగంలో ప్రవేశించాడు. గోద్రెజ్ టేబుల్ ముందు, ఫ్యాను క్రింద, ఫ్రేం కుర్చీలో కూర్చున్న అతనికి నిజంగా "తను అదృష్టవంతుడే" అన్న భావం పొటమరిల్లింది.

ఉద్యోగం దొరకడం కూడా ఓ సంఘటనే మరి.

అట్లాంటి శివన్నారాయణకు ఆరు మాసాలు గడిచేసరికి ఓ పెద్ద సమస్య వొచ్చి పడింది.

రెడ్డి అండ్ రావు మెడిసిన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని ఆఫీసులో మంజుల ఓ పెద్ద మ్యాగ్నెట్. ఆమె అందచందాల ఆకర్షణతోనే ఆఫీసంతా పచ్చతోరణం పగిది కళకళలాడుతూ ఉంటుంది. మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ సెక్రటరీ ఆమె. ఆఫీసులో చేరి సంవత్సరన్నర పైనే అవుతుంది. బి. ఏ. చదివింది గానీ ప్యాసు కాలేదు. టైపు మిషనుమీద వ్రేళ్ళు పెట్టడం చేతనవును, పెద్దగా టైపుచేయడం రాదు. చూపుడు వ్రేలితో ఒక్కొక్క అక్షరం చొప్పున నిముషానికీ అయిదారు మాటల స్పీడుతో టైపు చేస్తుంది అత్యవసరమైన పరిస్థితులలో.

మంజుల గొప్ప అందగత్తె. తెల్లని వెన్నెల్లాంటి ఆమె శరీర ఛాయకు, కను ముక్కు తీరు కలిగి, ఎత్తూ లావూ సరిసమాన స్థాయిలో వుండి, ఆకర్షణే అన్నింటినీ మించిన అందంగా మెరిసి పోతూ, మగవాడి మనస్సును అడుగు ముందుకు వేయనివ్వదు. ఆమెను తన పర్సనల్ సెక్రటరీగా రామకృష్ణ నియమించడానికి "బ్లాక్ డాగ్" విస్కీ కలిగించే నిషాలాంటి ఉద్రేకాన్ని ఆమె

సౌందర్యం కలిగించడం ముఖ్య కారణం. ఆమెమీద మేనేజింగ్ డైరక్టరుకు ప్రత్యేకమైన ప్రేమాభిమానాలున్నాయి. ఆమె స్వతహాగా ఇంగ్లీషులో ఒక లేఖను, వ్రాయలేకపోయినా, టైపు చెయ్యలేకపోయినా, షార్టు హ్యాండు అంటే అక్షరమ్ముక్క ఏమీ తెలియక పోయినా-సెక్రటరీగా నియమించుకొని, తన చుట్టూ తిప్పుకోడానికి ఆమె అందమే, ఆకర్షణే పెద్ద క్వాలిఫికేషన్.

మంజుల పేరు చెబితే ఆఫీసంతా భూకంపం వచ్చినట్టు గజగజ లాడుతుంది. ఆమె మాటకు మేనేజింగ్ డైరక్టరు వద్ద మూడు అడుగుల మందాన విలువ ఉంది. కొంతమందికి ఆమె కొత్త ఉద్యోగాలు ఇప్పించగలదు. కొంతమందిని ఉద్యోగాలనుంచి తీసివేయగలదు. కొంతమందికి ఇట్టే ప్రమోషన్లు ఇప్పించగలదు. మరికొంత మందికి శాశ్వతంగా ప్రమోషన్లు లేకుండా చేయ గలదు. ఆఫీసులో సెలవులు ఇప్పించడానికి కూడా ఆమె చేయిలేక పోలేదు. పేరుకు మేనేజింగ్ డైరక్టర్‌గానీ, ఆఫీసు పరిపాల నంతా ఆమె చేతులలోనే వుంది, కాబట్టి ఆఫీసు ఉద్యోగస్తులు ఆమెకే ఎక్కువ గౌరవాన్ని ఇస్తూంటారు. ఏ ఉద్యోగీ ఆమె కేసి ధైర్యంగా, నిటారుగా, మనస్సులో ఓ ఉద్దేశాన్ని నిల్పి కొని చూడటానికి వీలు లేదు.

మేనేజింగ్ డైరెక్టరు మద్రాసు, బొంబాయీ, కలకత్తా. ఢిల్లీ-ఏ పట్టణాలకు ఆఫీసు పనిమీద వెళ్ళినా మంజులను వెంట బెట్టుకు వెళతాడు. పెద్ద పెద్ద హోటళ్ళలో ఎయిర్ కండిషన్డు గదులలో ఇద్దరూ కలిసే దిగుతారు. విమానాలలో ఇద్దరూ కలిసే ప్రయాణం చేస్తారు. సినిమాలకీ, పిక్నిక్లకూ, హార్సు రేసులకూ ఇద్దరూ కలిసే వెళతారు.

మంజులకు ఇంకా పెళ్ళికాలేదు. ఆమె పెళ్ళిబాధ్యతను

నెత్తిన వేసుకోవడానికి కని పెంచిన తల్లి దండ్రులు లేరు. ఎప్పుడో పరలోక గతులైనారు. ఒక అన్నయ్య విజయవాడలో ఉద్యోగం చేసుకుంటూ వున్నాడు. గానీ, అన్నయ్యమాట ఈ చెల్లాయి విని చాలా కాలమైంది. "నా బ్రతుకు నేను చూసుకోగలను. నువ్వు నాకేమీ సాయపడక్కర్లేదు." అని నిష్కర్షంగా చెప్పింది. దాంతో ఆయన తన చెల్లెలి బాధ్యతను లోకానికి వదిలివేశాడు.

మంజుల అందాన్ని కళ్లారా చూసి 'ఇంత గొప్పది' అని శివన్నారాయణ అనుకోలేదు. అతనికి వయస్సు వచ్చినా స్త్రీల కేసి చూసే అలవాటు చేసుకోలేదు. ఇంత కాలమూ జీవితంలో జీవించడానికే సంఘర్షణకు గురైనాడు. అతనిహృదయం ఆకలిని తీర్చుకోడానికే సతమతమైంది గానీ, స్త్రీ యొక్క అందచందాల్ని ఆకర్షించే ఉద్యోగాన్ని చేపట్టలేదు. ఆపీసులో తన పనేమిటో తాను నిక్కచ్చిగా చూసుకొనే వాడు. ఆఫీసు వొదిలాక నేరుగా నల్లకుంటలో వున్న తన గదికి చేరుకొనే వాడు. అంతకు మినహా అతనికి మరో ప్రపంచంతో నిమిత్తంలేదు.

ఒకరోజు సాయంత్రం శివన్నారాయణ సుల్తాన్ బజారులో నడుస్తూ వెళుతూంటే, కూరగాయలు కొంటున్న మంజుల కనబడింది. నమస్కారం చేశాడు శివన్నారాయణ మామూలుగా.

"ఈ బ్యాగ్ కొంచెం కారు దాకా తెచ్చి పెట్టండి" అన్నదామె నల్లద్దాల కళ్ళజోడు నుంచి విలాసంగా చూస్తూ.

అదే పరమ భాగ్యంగా ఎంచుకొని, అంత మంది జనంలోనూ నామూషిని ఏ మాత్రం పొందకుండా ఆ కూరగాయల సంచీ, కారులో పెట్టి, మళ్ళీ నమస్కారం చేశాడు శివన్నారాయణ.

మరోసారి ప్యాలెస్ టాకీసు వద్ద అయ్యగారు, ఆమె సినిమా కెళ్ళడానికి వస్తే - అక్కడ సినిమా పోష్టరు బొమ్మలు

చూస్తోన్న శివన్నారాయణ వాళ్ళ దగ్గరకు వెళ్లి వినయంగా నమస్కారాలు చేశాడు.

అయ్యగారు పది రూపాయల నోటు యిచ్చి, "రెండు టిక్కెట్లు పట్టుకు రావోయ్" అని అనగా, మహదవకాశంగా భావించి, రెండు టిక్కెట్లు తీసుకొచ్చి, చిల్లరతో సహా అయ్య గారి చేతిలో పెట్టాడు. వాళ్ళిద్దరూ చెట్టా పట్టా లేసుకొని సినిమా హాలులోకి వెళ్ళారు.

పై రెండు సందర్భాలలోనూ శివన్నారాయణ మంజుల కేసి సూటిగా, ధైర్యంగా, ఒక అభిప్రాయంతో చూడలేదు.

అట్లాంటిది ఓ రోజు మధ్యాహ్నం మేనేజింగ్ డైరెక్టరు రామకృష్ణ తన గదిలోకి శివన్నారాయణను పిలిపించాడు ఎయిర్ కండిషన్డు గదిలోకి ప్రవేశించ గానే అతనికి మరో ప్రపం చంలో సుఖంగా ఉన్నట్టు తోచింది. వినమ్రువదనుడై నమ స్కారం చేశాడు.

"ఎట్లా ఉంది ఉద్యోగం?" అన్నాడు రామకృష్ణ

"మీ దయవల్ల కూటికీ, గుడ్డకూ లోటు లేదు. నిశ్చింతగా బ్రతుకు తున్నాను." అన్నాడు శివన్నారాయణ వినయం తోనూ, భక్తితోనూ.

"నీకు పెళ్ళి అయిందా"

లేదన్నట్లు తల ఆడించాడు శివన్నారాయణ

"పెళ్ళి చేసుకోవా?"

ఎందుకు చేసుకోను? అన్నట్టు రవ్వంత సిగ్గును కనబర్చాడు శివన్నారాయణ. అతని మౌనాన్ని సరీగ్గా అర్థం చేసుకో లేక రామకృష్ణ మళ్ళీ హెచ్చరించాడు.

"నాకు పిల్ల నెవరిస్తారండీ! అయినా పెళ్ళి చేసుకుని పెళ్లాన్ని

సుఖపెట్టే ధైర్య సాహసాలు నాకు లేవండీ!" అన్నాడు శివన్నారాయణ బిడియంగా.

రామకృష్ణ బిగ్గరగా నవ్వాడు మనిషంతా వూగిపోతూ.

"నువ్వు మగవాడివి కాదా?"

"అందరి మగవాళ్ళలాంటి వాణ్ణి కాదండీ!"

మళ్ళీ రామకృష్ణ పెద్ద పెట్టున నవ్వాడు. తన మాటలు ఆయనకు నవ్వు ఎందుకు తెప్పిస్తున్నాయో ఆ మానవుడికి అంతు బట్టలేదు.

"భేష్! నువ్వు నాకు బాగా నచ్చావు. వివాహం పురుష లక్షణం అన్నారు. నీకో మంచి సంబంధం కుదిర్చాను పెళ్లి చేసుకో!"

శివన్నారాయణ మొహం ఆనందంతో వికసించింది. తన మీద మేనేజింగ్ డైరెక్టరుగారికి ఎంత అభిమానం? రోడ్డు ప్రక్క పిచ్చి కుక్కలా పనికి రాకుండా బ్రతుకుతూన్న తనని ఆదరించి, ఉద్యోగ మిచ్చి, పైగా ఓ ఇంటివాణ్ణి చేసేటందుకు కూడా ప్రయత్నిస్తున్నాడు. ఇంత మంచి వాళ్లు కూడా ఈ కాలములో ఉన్నారా ?

"పెళ్లికూతురు ఎవరో తెలుసా?"

తనకు తెలియదన్నట్టు అమాయకంగా శివన్నారాయణ తల ఆడించాడు.

"నా సెక్రటరీ మంజుల."

శివన్నారాయణ దిమ్మ తిరిగి బొమ్మ ఆట ఆడాడు. ఆపశంగా మేనేజింగ్ డైరెక్టరు కాళ్ళమీద విరుచుకు పడ్డాడు కృతజ్ఞతను తెల్పుకుంటూ.

ఓ శుభముహూర్తాన మంజులకూ, శివన్నారాయణకూ ఓ.

సినిమా హాలులో నిరాడంబరంగా వివాహం జరిగింది. కాని ఆ వివాహానికి మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ రాలేదు, అయితే యేం, ఖర్చు నంతటినీ ఆయనే భరించాడు.

*　　　*　　　*

వివాహం జరిగాక మంజులా, శివన్నారాయణ శాంతినగర్ కాలనీలో ఓ మంచి యిల్లు రెండు వందల యాభై రూపాయలకు అద్దెకు తీసుకుని అందులోకి మారారు. 'తాము ఉండేందుకు ఇంత మంచి ఇల్లు దేనికి?' అనుకున్నాడు శివన్నారాయణ, కాని ఆ ముక్క భార్య ఎదుట అనడానికి ఎందుకో అతనికి భయమేసింది. తమ హోదాకు తగ్గట్టు దర్జాగా బ్రతకాలనేది ఆమె ఆశయం.

ఆ యింట్లో ప్రవేశించిన వారం రోజులకే మంజుల పడక వేసింది. ఆమె వొంట్లో బొత్తిగా బావుండడంలేదు. వాంతులు నీరసం, ఏమి తిన్నా ఇమడకపోవడం, ఎంత తిన్నా మనిషి క్షీణించడం, శివన్నారాయణకు భయమేసింది. వివాహమైన పదిరోజులకే ఆమెకొచ్చి పడ్డ ఇబ్బందిని చూసి.

"మంచి లేడీడాక్టరుకు చూపెడదాం" అన్నాడు శివన్నారాయణ ఆదుర్దాని వ్యక్తపరుస్తూ.

"మీకేం తెలియదు? మీరు మాట్లాడకుండా వూరుకోండి" అన్నది మంజుల గట్టిగా.

నెల రోజుల్లోనే శివన్నారాయణ ఉద్యోగంలో పెద్ద మార్పు వచ్చింది. అతనికి అమాంతంగా ప్రమోషన్ వచ్చింది. అయిదు వందల రూపాయలు నెలకు. అతని కొచ్చిన ప్రమోషనుకు ఆ ఆఫీసులో ఎవ్వరూ ఆశ్చర్య పడలేదు. మేనేజింగ్ డైరెక్టరు తల్చుకుంటే ఒక ప్యూను ఒక సంవత్సరములోనే ఆఫీసు సూప

రింటెండెంట్ కావచ్చు. అందులో అబ్బుర మేముంది?

ప్రమోషనైతే వచ్చింది గానీ, జీతం కూడా హెచ్చుగా లభిస్తున్నా ఆ ఉద్యోగం శివన్నారాయణకు నచ్చలేదు. నెలలో ఇరవై రోజులు టూరింగ్ లోనే ఉండవలె. ఇంటి దగ్గర ఉండేందుకు అవకాశం లేదు.

ఒక రోజు రాత్రి పదకొండు గంటలకు శివన్నారాయణ టూరింగ్ నుంచి హఠాత్తుగా ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు మేనేజింగ్ డైరెక్టర్ కారు ఉండటాన్ని చూసి అదిరి పోయాడు. మనస్సు మనస్సులో లేదు. చెదరిన రెల్లు గడ్డిలా అయింది బుర్రంతా. గేటు తలుపు తెరచుకొని లోపల వరండాలోకి వెళ్ళాడు. కిటికీలోంచి లోపలకు చూశాడు.

—మంజులా, మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ ఒకే బెడ్ పైన, బ్లూ లైట్ కాంతిలో...

ఆ దృశ్యానికి శివన్నారాయణ తల తూర్పు దిక్కు నుంచి పడమటి దిక్కు కొచ్చింది. అతని మస్తిష్కపు లేబొరేటరీలోని పరికరాలన్నీ తునాతునకలై పోయాయి.చేతిలో వున్న బ్యాగ్‌ను అక్కడ వరండాలో వొదిలేసి, గబగబా బయటకునడిచాడు.

ఆ పోవడం మళ్ళీ శివన్నారాయణ ఆ ఇంటి గడప తొక్కలేదు. ఆ పట్టణంలో వున్నట్టు కూడా జాడలేదు.

తర్వాత ఆరు మాసాల లోనే మంజుల గుమ్మడి పండు లాంటి పిల్లవాణ్ణి కన్న సంగతి, తన భర్త త్వరలోనే తిరిగి వస్తాడని చెప్పుకుంటూ ఆమె ఆ ఇంటిలోనే వుండడం, ఆ ఆఫీసులోనే సెక్రటరీ ఉద్యోగం చేస్తున్న విషయమూ - శివన్నారాయణకు చెప్పినవాళ్ళు లేరు.

—

(సుహాసిని)